నేడు 'డయల్ యువర్ డీఎం'

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల సమస్యలు, ఫిర్యాదులు, సలహాలు స్వీకరించేందుకు శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు డీఎం కృష్ణమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జుక్కల్, కొల్హాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సుల ప్రయాణికులు సమస్యలు, సూచనలు తెలియజేయాలనుకుంటే సెల్ నంబర్ 9959226249 కు కాల్ చేయాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత


చెక్కును అందజేస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ యువనేత, జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్‌రెడ్డి బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్ట్ నల్ల బాలు (శశిధర్‌గౌడ్) పిల్లల చదువు కోసం గురువారం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించిన 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా కేటీఆర్ చేతుల మీదుగా చెక్కు అందించామన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో రాయితీ

చైతన్యపురి: విజయవాడ, బెంగళూరు రూట్‌లో నడిచే టీజీఎస్ ఆర్టీసీ బస్సు టికెట్లలో రాయితీ ఇస్తున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డీఎం కే కృష్ణమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విజయవాడ రూట్‌లో..

గరుడ ప్లస్ (ఏసీ) బస్‌లో 30 శాతం, ఈ–గరుడ (ఏసీ)లో 26 శాతం, రాజధాని (ఏసీ) బస్‌లో 16 శాతం, స్లీపర్, స్లీపర్ కమ్ సీటర్ (ఏసీ)లో 16 శాతం, సూపర్ లగ్జరీ (నాన్‌ఏసీ) బస్‌లో 20 శాతం రాయితీ.

బెంగుళూరు రూట్‌లో..

స్లీపర్ అండ్ స్లీపర్ కమ్‌సీట్ (ఏసీ) బస్‌లో 25 శాతం, సూపర్ లగ్జరీ నాన్ ఏసీ బస్‌లో ప్రయాణించే వారికి 20 శాతం రాయితీ ఉంటుందని డీఎం తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ లేక ఏటీబీఎస్ ఏజెంట్ వద్ద కూడా అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



లింగోజిగూడ: శివపురికాలనీలో రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లోని అంతర్గత రోడ్లను దాదాపు రూ. 62 లక్షల పూర్తిచేశామని, మిగిలిన ప్రధాన రోడ్డును వేయాలని కాలనీవాసులు కోరారని వీటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈలు విజయ్‌కుమార్, పవిత్ర నవీద్‌అలీ, కాలనీవాసులు కృష్ణారెడ్డి, నర్సింహాగుప్తా, బుజ్జి, రాజేశ్‌గౌడ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, ప్రవీన్‌రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

చాదర్‌ఘాట్: అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీఉద్దీన్ కోరారు. ఈమేరకు సర్కిల్–1 ఏఎస్ఓ నర్సింగ్‌రాజుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరంఆయన మాట్లాడుతూ.. అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి రేషన్‌కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరగా ఏఎస్ఓ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలి

హస్తినాపురం: భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని హిందూ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శ్మశాన వాటిక ప్రహరీ కూలిపోగా శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్మశాన వాటిక పక్కనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రహరీ నిర్మించాలని కోరారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో) టమాటా 39, వంకాయ 18, బెండ 45, పచ్చి మిర్చి 60, కాకర 23, బీర 28, క్యాబేజీ 16, ఫ్రెంచీబీన్స్ 65, క్యారెట్ 45, దొండ 19, చిక్కుడు 55, గోకర 40, బీట్‌రూట్ 28, క్యాప్సికం 60, ఆలుగడ్డ 23, దోస 15, సొరకాయ 11, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 25 ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

శ్రావణ మాసం షురూ

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు

శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, మన్సూరాబాద్


ప్రత్యేక అలంకరణలో మాతా మైదాన్‌లోని విజయదుర్గా మాతా


సామూహిక కుంకుమార్చనలో మహిళలు


అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


అష్టలక్ష్మి ఆలయంలో భక్తులు

అంధ విద్యార్థులకు

కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన

సైదాబాద్: అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపితో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అధికారులకు సూచించారు. రెవెన్యూ, దివ్యాంగుల సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో కలిసి మలక్‌పేట బీబ్లాక్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఉన్నత పాఠశాల, వసతి గృహాలను శుక్రవారం తనిఖీ చేశారు. వసతి గృహం ప్రాంగణం, బస చేసే గదులు, వాష్‌రూమ్స్, స్టోర్, కిచెన్‌లను పరిశీలించారు. వసతులు, సమస్యలను బాలికలను అడిగి తెలుసుకున్నారు. భోజనాలు చేసేందుకు డైనింగ్ హాల్ కావాలని, వసతి గృహం వద్ద సెక్యూరిటీ కల్పించాలని విద్యార్థులు కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తరచూ మెడికల్ చెకప్ చేయించాలని సూచించారు. హాస్టల్ కంపౌండ్ వాల్‌పై వెంటనే ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాస్టల్ వార్డెన్, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో సమయానికి ఆహార పదార్థాలు అందించాలని వంట సిబ్బందికి సూచించారు. వసతి గృహానికి ఎడమ వైపు శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ గృహాలను పరిశీలించి వివరాలు అందించాలని సైదాబాద్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం అంధ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి బోధనా విషయంలో ఆమె పలు సూచనలు చేశారు.


బాలలతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్


అంధ బాలికలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిచందన

భోజనం చేసిన కలెక్టర్..

అంధ బాలికల పాఠశాల పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనాన్ని పరిశీలించారు. బాలలతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సదనం బాలలతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు రాజేందర్, సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, పాఠశాల ప్రిన్సిపాల్ అస్రా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నాగోలు: పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) సీఐ దేవేందర్ హెచ్చరించారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు ఆదేశాల మేరకు రాచకొండ ఎస్ఓటీ ఎల్‌బీ నగర్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ ఎండీ. షాకీర్ హుస్సేన్ సూచనల మేరకు 'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా రాచకొండ ఏహెచ్‌టీయూ సిబ్బంది ఎన్టీఆర్‌నగర్, ఎల్‌బీనగర్‌లో వ్యాపారులకు శుక్రవారం అవగహన కల్పించారు.ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారిచే పని చేయించడం వల్ల వారి ఆరోగ్యం, విద్య, భద్రత వారి అభివృద్ధికి హాని అవుతుందని, ఇది వారి హక్కులను ఉల్లంఘించడమే కాకుండా వారి భవిష్యత్తును కూడా నాశనం చేస్తుందని తెలిపారు. బాలల హక్కులను కాపాడడం వారి భవిష్యత్తును నిర్మించడం మనందరి బాధ్యత తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటశ్రీను, రాములు, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు గుళ్ల బోనాలకు రండి


ఆహ్వాన పత్రికను ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, రామకృష్ణాపురం డివిజన్‌లోని పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల గుడి (మూడు గుళ్లు) బోనాల ఉత్సవాలు ఈనెల 31 నుంచి ఆగస్టు 3 నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచన్నగారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డికి శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 31న 1వ తేదీన రేణుకా ఎల్లమ్మ కల్యాణం, 3న అమ్మవార్లకు బోనాలు సమర్పణ సాయంత్రం మైసమ్మ అమ్మవారి ఫలహార బండి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత, ప్రధాన కార్యదర్శి బండి మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడు గట్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

సాక్షి,సిటీబ్యూరో: వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ కోకరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని విద్యుత్ భవన్‌లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి కమిషన్ సభ్యుడు కే రఘును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగం, పరిశ్రమలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ జనరల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పి ధర్మరాజు, సంస్థ అధికార ప్రతినిధి శివాజీ గౌడ్, మేకల శ్రీహరి, మెట్టు మధు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కే రఘును సన్మానిస్తున్న దృశ్యం

పార్కుల సుందరీకరణకు చర్యలు


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని పార్కులను సుందరీకరించి వాటిలో ఆహ్లాదకర వాతావరణం పెంపొందేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి తెలిపారు. రూ. 14 లక్షల 20 వేల వ్యయంతో ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీలోని పార్కు ప్రహరీ పనులను కాలనీవాసులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు శ్రీనివాస్, రఘు, మురళి, ప్రసాద్, నాగరాజు, వెంకటరత్నం, లీల, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

నాగోలు: కార్మిక శాఖ ఏఎల్ఓ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, సిబ్బంది ఆధ్వర్యంలో న్యూ నాగోల్‌లోని ఎస్ఏ డాంగే భవనంలో భవన నిర్మాణ కార్మికులకు ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి కార్డు రెన్యువల్ చేస్తారని ఏఐటీయూసీ అనుబంధ భవన కార్మిక సంఘం ఉప్పల్ కమిటీ నాయకుడు బొడ్డుపల్లి కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డు ఉన్నవారు ఒరిజినల్ కార్డు తీసుకుని ఆధార్ కార్డుతో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు నిర్వహించే కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏకగ్రీవ ఎన్నిక



చంపాపేట: దుర్గానగర్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులను స్థానిక సంక్షేమ సంఘ భవనంలో కాలనీవాసులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా వంగ జగన్నాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారిగా కిరణ్‌కుమార్‌గుప్తా, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌కుమార్, రామకృష్ణాచారి, రవి ప్రశాంత్, సంయుక్త కార్యదర్శిలుగా సతీశ్, దశరథరామ్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, ప్రభాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామితో నాయకులు

మలక్‌పేట: సమస్యలు పరిష్కరించాలని జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం నేతలు కోరారు. ఈమేరకు జాతీయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి బ్యాగరి అనంతయ్య, తెలంగాణ ప్రచార కార్యదర్శి మేక్‌నారే ఆనంద్, కార్యదర్శి కాశీనాథ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కార్మిక బోర్డు కమిటీ నియమించాలని, భవన నిర్మాణ కార్మికులకు ఓఆర్ఆర్ లోపల డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని, 60 ఏళ్లకు పైబడిన కార్మికుడికి ప్రతీ నెల రూ.5 వేలు పెన్షన్, ప్రమాద మరణానికి రూ. 10 లక్షలు సాయం అందించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని అనంతయ్య తెలిపారు. గ్రేటర్ ప్రధాన కార్యదర్శి కిషన్, సలహాదారులు రాములు, రాంచందర్‌యాదవ్, మల్లికార్జున్‌రావు, కృష్ణయ్య, మహేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి


ఇన్‌స్పెక్టర్‌తో తోపుడు బండ్ల వ్యాపారులు

వనస్థలిపురం: రైతు బజారు వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా తోపుడు బండ్లతో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నామని, తమకు వేధింపులు లేకుండా చూడాలని కోరుతూ పలువురు వ్యాపారులు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేశ్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ సర్కిల్ సీఐటీయూ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ.. రైతుబజారు వద్ద ఎన్నో ఏళ్లుగా తోపుడు బండ్లతో వ్యాపారాలు చేసుకుంటున్నారని, బయటినుంచి వచ్చిన కొందరు రోడ్డుపై వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, జయమ్మ, ఝాన్సీ, నిర్మల, మంజు, భారతి, అర్జున్, రుషి పాల్గొన్నారు.

విద్యార్థులు మేధోసంపత్తి పెంపొందించుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

మలక్‌పేట: విద్యార్థులు మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ అకాడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్ న్యూనోబుల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే, ఓరియంటేషన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అలాగే విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ మెంబర్స్ యాదిగిరెడ్డి, కల్పన, చంద్రయ్యగౌడ్, ప్రిన్సిపాల్ ప్రేమలత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి

వనస్థలిపురం: ఒక్క ఏడాదిలోనే రూ. 24 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని ఇది అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్లే సాధ్యమైందని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పలు కాలనీల్లో రూ. 18 కోట్ల నిధులతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని, మరో రూ. 6.5 కోట్లతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మరో రూ. 1.70 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. అలాగే మరో రూ. 6 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ విఘ్నేశ్వరి, జేడీఓ కృష్ణారెడ్డి, నాయకులు హరిందర్‌రెడ్డి, సాయికిరణ్, నిరంజన్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు పలు మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 వరకు దిల్‌కుషా ఫంక్షన్‌హాల్, ఫైర్‌స్టేషన్, ఆఫీసర్స్ మెస్, ఆర్యసమాజ్, అమీర్ ఫాతిమా మాస్క్, రామాలయం టెంపుల్, అక్బర్‌బాగ్ క్రాస్ రోడ్, దయానంద్ నగర్ పరిసర ప్రాంతాలు. అలాగే ఉదయం 11 నుంచి 11:30 వరకు యూనిక్ స్కూల్, గౌస్ కేఫ్, ఇమ్లిబన్ మజీద్, ముర్తుజానగర్, సాదత్ నగర్, బడా చంద్రానగర్, జీపీ బ్యాంక్ కాలనీ, త్రివేణి నగర్, వీకే డాగేనగర్ పరిసర ప్రాంతాలు. మధ్యాహ్నం 12 నుండి 12:30 వరకు హదీ అమీన్ మజీద్, మూన్లీ స్కూల్, సీఐబీ క్వార్టర్స్, ఓల్డ్‌మలక్‌పేట వాటర్‌ట్యాంక్, జియా ఉల్ కా మజీద్, అబుబకర్ మజీద్ పరిసర ప్రాంతాలు.

చంపాపేట సబ్ స్టేషన్ పరిధిలో..

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉదయ్‌నగర్, పద్మానగర్, గాయత్రీనగర్, మందమల్లమ్మ ప్రాంతం, కర్మన్‌ఘాట్, నిర్మలానగర్, మైత్రిపురం, క్రాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాలనలో ప్రభుత్వం విఫలం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


శ్రీరామాహిల్స్‌కాలనీలో ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్‌పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామాహిల్స్‌కాలనీలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గురువారం వేర్వేరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగడం లేదని, అలాగే కొత్తవి ఏర్పాటు చేయడం లేదన్నారు. లోప్రెషర్‌లో తాగునీటి సరఫరా అవుతుందని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పార్కు పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు పోచబోయిన జగదీశ్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్ర యాదగిరి, భాస్కర్ యాదవ్, రాంకోటి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, స్వామిగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, ఆనవేమారెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రాజయ్య, శివలింగం, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం..

ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శ్రీరామాహిల్స్ కాలనీలోని ఓపెన్‌జిమ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో మిగిలిన సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, దామోదర్‌గౌడ్, వెంకటరమణగౌడ్, రంగారెడ్డి, విష్ణు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామాహిల్స్‌కాలనీలో ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి